

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. మంచిర్యాలలో సోమవారం మహాలక్ష్మి పథకం, ఆరోగ్యశ్రీ పెంపు పథకాలను ప్రారంభించారు. 8లో

## బస్సు ప్రయాణంపై ఆసక్తి

మంచిర్యాలఅర్బన్: మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకానికి మంచిర్యాల డిపో పరిధిలో అనూహ్య స్పందన లభిస్తోంది. శనివారం మధ్యాహ్నం ప్రారంభమైన ఈ పథకం కింద బస్సుల్లో 18,331 మంది మహిళలు ప్రయాణించారు. ఆదివారం 44,137 మంది మహిళలు ప్రయాణం చేశారు. ఉచిత ప్రయాణ సౌకర్యం వినియోగించుకునే వారి సంఖ్య పెరిగిందని డీఎం రవీంద్రనాథ్ తెలిపారు.

## వాతావరణం

గరిష్టం/కనిష్టం 29.0 /15.0

ఉదయం వేళ ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. రాత్రివేళ మేఘావృతమై ఉంటుంది. చలిగాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

## న్యూస్‌రీల్

### అవిశ్వాసాన్ని ఆపేందుకు మంతనాలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలో అవిశ్వాసాన్ని ఆపేందుకు మంతనాలు సాగిస్తున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్లు ఒక్కొక్కరుగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. పలువురు బీఆర్‌ఎస్ పార్టీని వీడడంతో ఉన్నవారిని కాపాడుకునేందుకు మున్సిపల్ చైర్మన్ అప్రమత్తం అయ్యారు. కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లకుండా ఉండేందుకు రూ.లక్ష చొప్పున చెల్లించేందుకు ముందుకు రాగా.. కొందరు ఆ డబ్బు తీసుకోగా, మరికొందరు వద్దని వెళ్లినట్లు సమాచారం. డబ్బు తీసుకున్నవారిలో ఎంతమంది పార్టీ మారకుండా ఉంటారో, డబ్బులు తీసుకొని వారు మారేందుకు అవకాశం ఉండడంతో పదవిని ఎలా కాపాడుకోవాలనే దానిపై చైర్మన్ మంతనాలు చేస్తున్నట్లు సమాచారం. 2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 36వార్డులకుగాను 21మంది బీఆర్‌ఎస్ నుంచి, 14మంది కాంగ్రెస్ నుంచి, ఒకరు స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందారు. గత ఏడాది కాంగ్రెస్ కౌన్సిలర్లు ఐదుగురు బీఆర్‌ఎస్‌లో చేరడంతో వారి సంఖ్య 26కు చేరింది. ఇటీవల మారిన సమీకరణాలతో బీఆర్‌ఎస్‌కు చెందిన ఐదుగురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో, ఒకరు బీజేపీలో చేరడంతో ఆ సంఖ్య 20కి పడిపోయింది. మరో ఐదుగురు పార్టీ మారి అవిశ్వాసం ప్రతిపాదిస్తే పదవికి ముప్పు ఏర్పడుతుందనే ఉద్దేశంతో చైర్మన్ కౌన్సిలర్లతో మంతనాలు జరిపి నజరానా ఇస్తున్నట్లు సమాచారం.

### 17న జెడ్పీ సమావేశం

మంచిర్యాలటౌన్: జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 17న జెడ్పీ కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో కే.నరేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత అధికారులు ప్రగతి నివేదికలతో, జెడ్పీటీసీ సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

### సమర్థవంతంగా నిర్వహించాలి

దండేపల్లి: స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి అన్నారు. దండేపల్లి ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన మండల ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ సమావేశాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ పాఠశాలల ఉపాధ్యాయుల బోధనలు, ప్రదర్శనలతో నూతన విషయాలు తెలుసుకోవచ్చని అన్నారు. జిల్లా సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్, అసిస్టెంట్ స్టాటికల్ అధికారి రాజ్‌కుమార్, మండల నోడల్ అధికారి చిన్నయ్య, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

### పకడ్బందీగా ఓటరు జాబితా సవరణ

మంచిర్యాలఅగ్రికల్చర్: ఓటరు జాబితా సవరణ-2024 పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లతో ఎస్‌ఎస్‌ఆర్ 2024 నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో వివరాలు నమోదుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులతో ప్రతీ ఇంటికి వెళ్లి దరఖాస్తులు స్వీకరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. 1500 మంది ఓటర్ల సంఖ్య మించిన ప్రాంతాల్లో నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ బి.సంతోష్, జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్, మోతిలాల్, చెన్నూర్ ఆర్డీవో సిడాం దత్తు పాల్గొన్నారు.

### ఆటలపోటీలతో కొత్త సంబంధాలు



విజేతలతో డైరెక్టర్లు

శ్రీరాంపూర్: ఆటల పోటీలతో కొత్త సంబంధాలు చిగురిస్తాయని కంపెనీ డైరెక్టర్(ఫైనాన్స్) యన్.బలరాం తెలిపారు. సోమవారం ఇల్లందు క్లబ్ 28 అధికారుల క్లబ్ సభ్యులకు క్రీడా పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు డైరెక్టర్లు బహుమతి ప్రదానం చేశారు. మరో డైరెక్టర్ డీ.సత్యనారాయణరావు మాట్లాడుతూ ఆటల్లో గెలుపోటములు సహజమని తెలిపారు. టేబుల్ టెన్నిస్, టెన్నీకాయిట్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, అధికారుల సంఘం కేంద్ర అధ్యక్షుడు జక్కం రమేష్, ఏరియా సేవా అధ్యక్షురాలు రాధాకుమారి, అధికారుల సంఘం ఉపాధ్యక్షులు ఏవీ రెడ్డి, ఏరియా అధ్యక్షుడు అబ్దుల్ ఖాదిర్, క్రీడల కన్వీనర్ రమేష్ బాబు, కోకన్వీనర్ తిరుపతి పాల్గొన్నారు.

# అసైన్డ్ చుట్టూ అక్రమం !

ఆ భూములు జిల్లా కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోనే ఉంటాయి. నిత్యం ఇద్దరు ఐఏఎస్ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు ఆ వైపు నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. అందరి కళ్లముందే అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఎన్నో ఫిర్యాదులు అందాయి. అడపాదడపా విచారణలు జరిగాయి. ఈసారి అధికారులు కాస్త ముందడుగు వేసి అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఈ తతంగమంతా జరుగుతున్నది నస్పూర్ పట్టణం జాతీయ రహదారి-63 పక్కన, కలెక్టరేట్ సమీపంలోని సర్వేనంబరు 42, 52లోని సర్కారు భూమిలోనే. బీఆర్‌ఎస్ సర్కారు మారాక.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ చర్యలు చేపట్టడం గమనార్హం.

- రాజీ కింద అప్పగించిన రెండెకరాలు
- ఆ జాగాలోనే కొందరు ఇళ్ల నిర్మాణాలు
- అధికారుల సమక్షంలో మళ్లీ కూల్చివేత
- టీఎన్జీవో, దళితుల వివాదంతో ఎవరికి లబ్ధి?



నస్పూర్‌లో కూల్చివేసిన ఇళ్ల నిర్మాణాలు



పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ అధికారుల సమక్షంలో కూల్చివేత

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: నస్పూర్ పట్టణంలోని ప్రభుత్వ భూమి 42, 52 సర్వేనంబర్లలో అక్రమ నిర్మాణాలు మరోసారి తెరపైకి వచ్చాయి. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని అధికారులు కూల్చివేశారు. కళ్ల ముందే ప్రతీరోజు అక్కడ నిర్మాణాలు సాగుతున్నా మొదట అధికారులు ఎవరూ పట్టించుకోలేదు. దీనిపై పలుమార్లు కలెక్టర్‌తో సహా స్థానిక తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులకు విన్నవించుకున్నా ఎవరూ అటువైపు దృష్టి సారించలేదు. వాస్తవ పట్టాదారులు, అసైన్డ్‌దారులతో సంబంధం లేని వ్యక్తులు అక్కడికి చేరారు. సర్కారు భూమిని రియల్ వ్యాపారంతో సొమ్ము చేసుకుందామని ప్రణాళిక వేశారు. నిర్మాణాలను కూల్చివేయడంతో కంగుతిన్నారు.

**ఎడతెగని వివాదం**

నస్పూర్ శివారులో వందల ఎకరాల సర్కారు భూములున్నాయి. ఉమ్మడి ఏపీలో నాటి సర్కారు సర్వేనంబరు 42లోనూ సాగు చేసుకుని జీవనాధారం కోసం స్థానిక దళితులకు అసైన్ చేసింది. కానీ చాలామంది అసైన్డ్‌దారులు సాగులో లేరు. కొందరే ఉన్నారు. కాలక్రమేణ మంచిర్యాల పట్టణం విస్తరించడంతో కొందరు అధికారులు ఇళ్ల స్థలాలకు కేటాయించాలని టీఎన్జీఓ హౌసింగ్ సొసైటీతో అర్జీ సమర్పించారు. అప్పటి రెవెన్యూ అధికారులు ఆ భూమినే కేటాయిస్తూ ప్రొసీడింగ్స్ ఇచ్చారు. 32ఎకరాల్లో రెండెకరాలు విద్యుత్ సబ్‌స్టేషన్‌కు, పది గుంటలు స్థానిక విలేకరులకు ఇళ్ల స్థలాలకు పోగా, మిగతా 29.30ఎకరాలు కేటాయించారని టీఎన్జీవోలు చెబుతుంటారు. కానీ.. తమ పేరుతోనే ఇంకా ఆ భూమి ఉందని, తమకు హక్కులు ఉన్నాయని దళితులు తిరగబడ్డారు. కోర్టుల్లో కేసులు వేశారు. మధ్యవర్తులే మళ్లీ రాజీ కుదిర్చారు. రెండెకరాల భూమి అడ్డుచెప్పే వారికి ఇచ్చి చల్లబర్చేందుకు ఒప్పందం చేసుకున్నారు. అప్పటి నుంచే టీఎన్జీవో సొసైటీ స్థలంలో ఇళ్ల నిర్మాణాలు మొదలయ్యాయి. అప్పగించిన ఆ రెండెకరాలను రియల్ ఎస్టేట్ చేతుల్లోకి వెళ్లగా, ఇళ్ల నిర్మాణం చేపట్టి అమ్మకాలు సాగిస్తున్నారు. వాస్తవానికి ఆ భూమిని టీఎన్జీవో సొసైటీ ఇచ్చేందుకు గానీ, ఇతరులు తీసుకునే హక్కు ఎవరికీ లేదు. చట్ట విరుద్ధంగా సర్కారు భూమిని ఇష్టారీతిన అప్పగించారు. కొందరు బిల్డర్లు, పెట్టుబడిదారులు కలిసి ఈ ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. తాజాగా అధికారులు స్పందించి వాటినే కూల్చి వేయించడం గమనార్హం.

**అంతా 'గోపాల'మే !**

నస్పూర్ శివారులో సర్కారు, అసైన్డ్ భూముల్లోని వివాదాలను తనకు అనుకూలంగా మలుచుకుంటూ భూ 'గోపాల'మే అన్నట్లుగా వ్యవహరిస్తున్న ఆయనేది ఇక్కడ కీలక పాత్ర. అటు టీఎన్జీవోలు, ఇటు దళితవర్గాలకు తగువు పెట్టాలన్నా, రాజీ కుదర్చాలన్నా ఆయనే కీలకం. ఇప్పటికే అనేక తప్పుడు పత్రాలు సృష్టించి పెద్ద ఎత్తున భూములను ఆక్రమించుకుని ఫెన్సింగ్ వేసుకున్న ఆయనకు టీఎన్జీవో సొసైటీ భూమి వివాదం బాగా కలిసొచ్చింది.

**హౌసింగ్ సొసైటీ సక్రమమేనా?**

టీఎన్జీవోలకు కేటాయించిన స్థలంలోనూ అనేక వివాదాలు ఉన్నాయి. సొసైటీలోని వ్యక్తులకు ఇళ్ల ప్లాట్లు కేటాయించకపోగా, అప్పటి ఎమ్మార్వోతో ఏకంగా ఇళ్ల పట్టాలు ఇప్పించుకున్నారు. వీరిలో ఇంకా కొందరికి ప్లాట్లు చూపించలేదు. మరోవైపు సొసైటీ స్థలంలో కొత్తగా ఇళ్ల నిర్మాణాలు సాగుతున్నాయి. ఈ వివాదంపై ఫిర్యాదులు రాగా, ముగ్గురు ఉన్నతాధికారులతో విచారణ కోసం కమిటీ వేసినప్పటికీ చర్యలు మాత్రం తీసుకోలేదు. మరోవైపు ప్రభుత్వానికి నిర్దేశిత ఫీజు కూడా ఇంకా చెల్లించలేదనే ఆరోపణలు ఉన్నాయి.

### సిబ్బంది సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్

- బీట్ ఆఫీసర్ లత ఘటనపై విచారణ జరిపిస్తాం
- డీఎఫ్‌ఓ శివ్‌ఆశీష్ సింగ్



డీఎఫ్‌ఓకు మహిళా సిబ్బంది వినతి

మంచిర్యాలక్రైం: అటవీశాఖలో సిబ్బంది సమస్యల పరిష్కారానికి సోమవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తున్నట్లు జిల్లా అటవీ శాఖ అధికారి శివ్‌ఆశీష్‌సింగ్ అన్నారు. సోమవారం స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో, తోటి ఉద్యోగులతో ఎదురయ్యే సమస్యలతోపాటు వ్యక్తిగత ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. సిబ్బంది పేర్లను గోప్యంగానే ఉంచి విచారణ జరిపి సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం సిబ్బంది విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. కాగా, బీట్ ఆఫీసర్ లత ఆత్మహత్యాయత్నంపై డీఎఫ్‌ఓను సంప్రదించగా.. ఆత్మహత్యాయత్నం బాధాకరమని, రాతపూర్వకంగా ఫిర్యాదు చేయలేదని, ఫిర్యాదు చేస్తే కమిటీ ఏర్పాటు చేసి విచారణ జరిపిస్తామని అన్నారు. పేపర్లలో వచ్చిన కథనాల ఆధారంగా సుమోటోగా తీసుకుని విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**మహిళా సిబ్బంది వినతి**

కోటపల్లి రేంజ్ వెంచపల్లి బీట్ ఆఫీసర్ లత ఆత్మహత్యాయత్నం నేపథ్యంలో జిల్లాలోని అటవీశాఖ మహిళా సిబ్బంది ఏకమయ్యారు. గ్రీవెన్స్‌లో డీఎఫ్‌ఓకు వినతిపత్రం అందజేశారు. లత ఆత్మహత్యాయత్నానికి కారకులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కోటపల్లి ఎఫ్‌ఆర్‌ఓపై పలు ఆరోపణలు చేసినట్లు తెలిసింది. అనంతరం మహిళా సిబ్బంది లత చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. తలా కొంత నిధిని పోగుచేసి ఆర్థిక సహాయన్ని అందజేశారు.

# రీజియన్‌లో 31 పోలింగ్ కేంద్రాలు



గత ఎన్నికల్లో ఓటు వేసేందుకు బారులు తీరిన కార్మికులు

- 170 మందికి ఎన్నికల విధులు
- 93 బ్యాలెట్ బాక్స్‌లు
- కోఆర్డినేటర్‌గా శ్రీరాంపూర్ జీఎం

శ్రీరాంపూర్: ఈ నెల 27న సింగరేణి ఏడో దఫా గుర్తింపు సంఘం ఎన్నికలకు కంపెనీ సిద్ధమైంది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి డెప్యూటీ సీఎల్సీ శ్రీనివాసులు ఆదేశాల మేరకు అవసరమైన ఏర్పాట్లు సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా మంచిర్యాల, కుమురంభీం జిల్లాల పరిధిలోని బెల్లంపల్లి రీజియన్‌లో ఎన్నికల నిర్వహణకు అధికారులను కంపెనీ నియమించింది. శ్రీరాంపూర్ జీఎం బి.సంజీవరెడ్డిని రీజియన్ కోఆర్డినేటర్‌గా నియమించారు. ఆయన ఆధ్వర్యంలో బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్ డివిజన్లలో ఎన్నికలకు కావాల్సిన ఏర్పాట్లు, వసతులు కంపెనీ సమకూర్చనుంది. ఈ మేరకు ఆయన అన్ని ఏరియాల అధికారులతో ఏర్పాట్లపై సమీక్షిస్తున్నారు. పోలింగ్ కేంద్రాల్లో, కౌంటింగ్ కేంద్రాల వద్ద మొత్తం ప్రభుత్వ ఉద్యోగులే ఉండి ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ మేరకు రిటర్నింగ్ అధికారి ఆదేశాల మేరకు ఏరియాల వారీగా కంపెనీ సిబ్బందిని సమకూర్చడం అధికారులు కలెక్టర్లకు కోసం లేఖలు రాశారు.

**ఏర్పాట్ల వివరాలు..**

- కంపెనీ అధికారులు ఎన్నికలకు కావాల్సిన సదుపాయాలను సమకూరుస్తారు.
- ఈ ఎన్నికల ఖర్చును పూర్తిగా కంపెనీ భరిస్తుంది.
- రిటర్నింగ్ అధికారిగా ఉన్న డెప్యూటీ సీఎల్సీ ఆధ్వర్యంలో ప్రభుత్వ అధికారుల సమక్షంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహిస్తారు.
- ఎన్నికల జరిగే డిసెంబర్ 27 నాటికి ఆన్‌రోల్‌లో ఉన్న ఉద్యోగులందరికీ ఓటు హక్కు ఉంటుంది.
- బెల్లంపల్లి రీజియన్‌లో 14985 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో బెల్లంపల్లి ఏరియాలో 985 మంది, మందమర్రి ఏరియాలో 4876మంది, శ్రీరాంపూర్ ఏరియాలో 9124 మంది ఉన్నారు
- ఈ మూడు ఏరియాల్లో 31 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. బెల్లంపల్లిలో 5, మందమర్రిలో 11, శ్రీరాంపూర్‌లో 15 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తారు.
- 93 బ్యాలెట్ బాక్స్‌లు సిద్ధం చేశారు. ఓటర్ల సంఖ్యను బట్టి ఆయా కేంద్రాల్లో బ్యాలెట్ బాక్స్‌లు ఏర్పాటు చేస్తారు.
- రీజియన్ మొత్తంలో 170 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల విధుల్లో పాల్గొంటారు. శ్రీరాంపూర్‌లో 80మంది, మందమర్రిలో 60, బెల్లంపల్లిలో 30 మందిని కేటాయించారు.
- ప్రభుత్వం నుంచి ఆర్డీఓ ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరిస్తారు.
- ఏరియా ఎన్నికల అధికారి, బూత్‌ల వారీగా ప్రిసైడింగ్ అధికారులను త్వరలో రిటర్నింగ్ అధికారి నామినేట్ చేస్తారు.
- ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు రాత్రి ఫలితాలు వెలువరిస్తారు.
- డిసెంబర్ 25న సాయంత్రం 5 గంటల వరకే గనులపై ఎన్నికల ప్రచారానికి అనుమతి.
- శ్రీరాంపూర్ ఏరియా ఓట్లను సీసీసీలోని ఎస్సీఓఏ క్లబ్‌లో, బెల్లంపల్లి ఓట్లను సీఈఆర్ క్లబ్ గోలేటి టౌన్‌షిప్, మందమర్రి ఓట్లను సీఈఆర్ క్లబ్ మందమర్రిలో లెక్కిస్తారు.
- సీక్రెట్ బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ ఉంటుంది. బ్యాలెట్ పేపర్‌లో ఇస్తారు.
- ఓటు వేయడానికి ప్రతీ కార్మికుడు తన కంపెనీ ఐడీ కార్డు వెంట తెచ్చుకోవాలి. లేనిపక్షంలో అప్పటికప్పుడు గనులపై అధికారులు గుర్తింపు కార్డులు కూడా జారీ చేస్తారు
- మొత్తం 13 కార్మిక సంఘాలు ఎన్నికల్లో పాల్గొంటున్నాయి.
- సాధారణ ఎన్నికల వలే పోలింగ్ కేంద్రాల్లో కార్మిక సంఘాల ఏజెంట్లు ఉంటారు.

# బడిబయట పిల్లలెందరో..?

- చదువుకు దూరమైన పిల్లలపై సర్వే
- జనవరి 10వరకు విద్యాశాఖ వివరాల సేకరణ



దండేపల్లి: మామిడిపల్లి గ్రామ పంచాయతీలో సర్వే చేస్తున్న సీఆర్పీ నర్సయ్య

మంచిర్యాలఅర్బన్: బడికి రాని పిల్లలు ఎంతమంది ఉన్నారు.. రాకపోవడానికి కారణం ఏమిటి..? ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గుతోంది..? బడికి రాలేని పిల్లలు గ్రామాల్లో ఎంతమంది ఉన్నారనే వివరాల సేకరణకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. సోమవారం నుంచి క్షేత్రస్థాయిలో సర్వే ప్రారంభించింది. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతీ చిన్నారి చదువుకోవాలనే ఉద్దేశంతో బడిబయట పిల్లల సర్వే చేస్తోంది. వచ్చే నెల 10వరకు పూర్తి వివరాలు సేకరించనుంది. 6 నుంచి 14ఏళ్లలోపు, 15నుంచి 19 ఏళ్లలోపు వారిని గుర్తిస్తారు. బడి మానేయడం, అసలు రాకపోవడానికి కారణమేంటి అనే అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. అలాంటి వారికి అవగాహన కల్పించి పాఠశాలల్లో చేర్పించేందుకు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. బడి మానేసిన పిల్లలతోపాటు వలస కార్మికుల పిల్లల వివరాల సేకరణలో నిమగ్నమయ్యారు. బడి బయట పిల్లల వివరాలను ప్రభుత్వం సూచించిన ఫార్మాట్‌లో సేకరించి జాతీయస్థాయి ప్రబంధ్ పోర్టల్‌లో నమోదు చేస్తారు.

**సేకరణ ఇలా..**

బడి మానేసిన పిల్లలు, వలస కార్మికుల విద్యార్థుల వివరాల సేకరణ సీఆర్‌పీలతోపాటు ఐఈఆర్‌టీ, వీవీలతో సేకరిస్తున్నారు. జిల్లాలోని 18 మండలాల్లో 51 కస్టర్లలో 41మంది సీఆర్‌పీలు, 29 మంది ఐఈఆర్పీలు వివరాలు సేకరిస్తున్నారు. మారుమూల ప్రాంతం నుంచి పట్టణ ప్రాంతాలకు ఉపాధి కోసం వచ్చే వారి పిల్లలే బడికి దూరం అవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. 14ఏళ్లలోపు బడికి వెళ్లని విద్యార్థి పేరు, చిరునామా, తల్లిదండ్రుల పేరు, ఆధార్ సంఖ్యతోపాటు ఎందుకు రావడం లేదో వివరాలు నమోదు చేసుకుంటున్నారు.

**పని ప్రదేశాల్లో..**

ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ప్రజలు ఉపాధి కోసం వలస వెళ్తుంటారు. బొగ్గు, ఇటుక బట్టీలు, ఇతరత్రా ప్రాజెక్టులు, భవన నిర్మాణ పనులకు వెళ్లే వారి పిల్లలు పాఠశాలలకు వెళ్లలేని పరిస్థితి ఉంటే వారి కోసం ఒక ఉపాధ్యాయుడిని నియమించి స్కూల్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

**సమీప పాఠశాలల్లో చేర్పిస్తాం..**

బడిమానేసిన పిల్లల వివరాలు సేకరించి సమీప పాఠశాలల్లో చేర్పిస్తాం. 15నుంచి 19ఏళ్లలోపు పిల్లలను గుర్తించి ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో చేర్పిస్తాం. బడిబయట పిల్లలు లేకుండా చేయాలన్నదే సర్వే ఉద్దేశం. సీఆర్పీలు గ్రామాల్లో పర్యటించి చదువుకోలేని, బడి మానేసిన, వెళ్లలేని పిల్లల వివరాలు సేకరిస్తారు. సర్వేను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు నిరంతరం పర్యవేక్షిస్తారు.

– సత్యనారాయణమూర్తి, సెక్టోరల్ అధికారి

## కన్నుల పండువగా దీపారాధన



దీపాలు వెలిగిస్తున్న మహిళలు



శివపార్వతుల కల్యాణం



లక్ష దీపారాధనలో మహిళలు

చెన్నూర్: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో లోకకల్యాణార్థం సోమవారం నిర్వహించిన లక్ష దీపారాధన మహోత్సవం కన్నుల పండువగా సాగింది. వేద పండితులు వేమూరం మహేశ్వర్‌శర్మ, పులి దత్తాత్రేయ శర్మ, జక్కేపల్లి నాగేశ్వర్‌రావు, చింతబట్ల సత్యనారాయణ శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో గొడిసెల బాపురెడ్డిదేవిక, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి చైతన్య దంపతులు కూర్చున్నారు. లక్ష దీపారాధనతో హైస్కూల్ మైదానం దీపకాంతులతో విరజిల్లింది. అనంతరం హైదరాబాద్‌కు చెందిన నృత్య రవళి కళాక్షేత్రం ముత్యాల పరమేశ్వర్ శిష్య బృందం కళాకారులు పూజిత, స్వాంతన, నిఖిలారెడ్డి భరత నాట్య ప్రదర్శన అలరించింది. లక్ష దీపారాధనలో పట్టణానికి చెందిన వేలాది మంది మహిళలు పాల్గొన్నారు.

# సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ బి.సంతోష్
- ప్రజావాణి ప్రారంభం
- సమాచారం లేక స్పందన కరువు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ బి.సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. నస్పూర్‌లోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ మోతిలాల్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శేషాద్రి అర్జీలు స్వీకరించారు. కాగా, ఎన్నికల కారణంగా రద్దయిన ప్రజావాణి రెండు నెలల తర్వాత ప్రారంభం కాగా.. సమాచారం లేకపోవడంతో అర్జీదారుల నుంచి స్పందన కరువైంది. ఏడుగురు మాత్రమే సమస్యలపై అర్జీలు సమర్పించారు. స్వచ్ఛభారత్ కింద నిర్మించిన పబ్లిక్‌టాయిలెట్ సెప్టిక్ ట్యాంకుపై అక్రమంగా ఇంటి నిర్మాణం చేపడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లి పట్టణం టేకులబస్తీకి చెందిన కుర్సవల్లి రావత్ కోరాడు. నస్పూర్ మండలం తీగల్‌పహాడ్ సర్వే నంబరు 45లో లింగమూర్తి అనే వ్యక్తి అక్రమంగా చెరువు కట్టను కబ్జా చేసి వెంచర్ ఏర్పాటు చేశారని, తీగల్‌పహాడ్ కాలనీకి వెళ్లే రోడ్డు తొలగిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు ఎం.రాజు, బి.వినోద్ ఫిర్యాదు చేశారు.

**సమష్టి కృషితో ఎన్నికలు విజయవంతం**

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు అధికారులు, సిబ్బంది సమష్టి కృషితో విజయవంతం చేశారని కలెక్టర్ సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అభినందన, ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్, మోతిలాల్, మంచిర్యాల ఆర్డీవో రాములు, సిడాం దత్తు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎవరికి కేటాయించిన విధులు వారు సమర్థవంతంగా నిర్వహించారని కొనియాడారు.

## క్లుప్తంగా

### గుర్తు తెలియని మృతదేహం లభ్యం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ఓల్డ్ కాలనీలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు సీఐ బుద్దేస్వామి తెలిపారు. ఆ ప్రాంతంలో అపస్మారకస్థితిలో పడిఉన్న వ్యక్తిని పట్టణ పోలీసులు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని సిర్పూర్(టి) ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో ఉంచారు. మృతుని వయస్సు సుమారు 50 సంవత్సరాలు ఉంటాయని, ఎత్తు 5.5 అడుగులు, నీలిరంగు టీ షర్ట్, ఎరుపురంగు బనియాన్ వేసుకున్నాడు. కుడిచేతి పైన ఓం అని పచ్చబొట్టు, కుడిచేతికి కడెం ఉందని వివరించారు. వివరాలు తెలిసిన వారు 8712670507, 9866427288 నంబర్లలో సంప్రదించాలని సీఐ సూచించారు.

### మానవ హక్కుల మహిళా కమిటీ ఎన్నిక

మంచిర్యాలటౌన్: జాతీయ మానవ హక్కుల జిల్లా మహిళా కమిటీని సోమవారం జిల్లా కేంద్రంలో జిల్లా జనరల్ సెక్రటరీ కోరె శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. జిల్లా మహిళా అధ్యక్షురాలిగా కోరె స్వరూప, కార్యదర్శిగా పెరుగు సువర్ణ రెడ్డిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కుల్కాల రాజమొగిలి, మల్ల శ్రీనివాస్, రాసపెల్లి కుమార్, కొమ్ము రమేశ్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

### 16, 17 తేదీల్లో హ్యాండ్‌బాల్ పోటీలు

మంచిర్యాలటౌన్: ఈ నెల 16, 17 తేదీల్లో ఉమ్మడి జిల్లాలోని 17 సంవత్సరాల లోపు బాలబాలికలకు మందమర్రిలోని సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో హ్యాండ్‌బాల్ స్కూల్ లీగ్ పోటీలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోనె శ్యాంసుందర్‌రావు, కనపర్తి రమేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ.2 వేలు అందించనున్నట్లు వారు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జనవరి 1, 2007 తర్వాత జన్మించిన వారై ఉండాలి. ఈ నెల 13న సాయంత్రం 5 గంటల్లోగా టీం ఎంట్రీలను పంపించాల్సి ఉంటుందని, 15న రాత్రి 8 గంటల్లోగా రిపోర్టు చేయాలని, టీంలను అనుమతించడంపై ఆర్గనైజింగ్ కమిటీదే తుది నిర్ణయం అవుతుందని వారు పేర్కొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


శివశంకర్ (ఫైల్)

నస్పూర్: పట్టణ పరిధిలోని జాతీయ రహదారి-363 శ్రీరాంపూర్ మందమర్రి బైపాస్ రోడ్డుపై జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. సోమవారం సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరాంపూర్ ఏరియా భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన ఓంట్ర శివశంకర్, సతీష్ ఆదివారం రాత్రి శ్రీరాంపూర్ నుంచి కారులో మందమర్రి వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో శ్రీరాంపూర్ మందమర్రి బైపాస్ జాతీయ రహదారిపై దొరగారిపల్లెకు సమీపంలో కారు డివైడర్‌ను ఢీకొట్టి పల్టీ కొట్టింది. దీంతో కారు నడిపిస్తున్న సతీష్‌కు స్వల్ప గాయాలు కాగా ఓంట్ర శివశంకర్(32) అక్కడికక్కడే మృతిచెందాడు. శివకుమార్ కూలీ పని చేస్తుండేవాడు. అతడికి భార్య ఉంది. మృతుడి బంధువు గుమాన కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### దాడి కేసులో ఇద్దరి రిమాండ్

కాసిపేట: మండలంలోని పెద్దనపల్లికి చెందిన బెండె నవీన్‌పై బీరుసీసాతో దాడి చేసిన పల్లె పెద్దులు, సోమని గణేశ్‌లను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గంగారాం తెలిపారు. ఎన్నికల ముందు పాతకక్షలతో బీరుసీసా పగులగొట్టి దాడి చేయడంతో నవీన్‌కు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

# పనిచేయని మార్కెట్‌లో పనులు!

- ఆరేళ్లుగా అలంకార ప్రాయంగా బెల్లంపల్లి మామిడి మార్కెట్..
- రూ.1.20 కోట్లతో 2017లో నిర్మాణం పూర్తి
- ఇప్పటికీ కొనుగోళ్లు ప్రారంభించని అధికారులు
- అందుబాటులోకి రాకున్నా.. అదనపు నిధులు!
- తాజాగా సౌకర్యాలకు రూ.1.18 కోట్ల మంజూరు


మ్యాంగో మార్కెట్ యార్డులో నిర్మించిన సీసీరోడ్డు

బెల్లంపల్లి: బెల్లంపల్లి కేంద్రంగా నిర్మించిన మ్యాంగో మార్కెట్‌లో క్రయ విక్రయాలు జరగకపోగా కొత్తగా మరిన్ని సౌకర్యాలు కల్పించడానికి నిధులు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు అలంకార ప్రాయంగా ఉన్న మ్యాంగో మార్కెట్ యార్డులో ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. ఆలనా పాలన లేకుండా ఉన్న మార్కెట్‌యార్డుకు రూ.కోట్లు వెచ్చించడం పట్ల విమర్శలు వస్తున్నాయి. ఆరేళ్ల నుంచి ఎలాంటి చర్యలు తీసుకోని పాలకులు, అధికారులు అభివృద్ధి పనుల పేరిట రైతాంగాన్ని మభ్యపెడుతున్నారు. క్రయ విక్రయాలు జరగని మ్యాంగో మార్కెట్‌లో సౌకర్యాల పేరిట ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**రూ.1.20 కోట్లతో మ్యాంగో మార్కెట్**

తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత 2015లో బెల్లంపల్లికి మామిడి మార్కెట్ యార్డు మంజూరైంది. మార్కెట్ యార్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.20 కోట్ల నిధులు మంజూరు చేసింది. మామిడి తోటలకు కేంద్రంగా ఉన్న బెల్లంపల్లిని ఎంపిక చేసి కన్నాల బస్తీ శివారు ప్రాంతంలో నిర్మాణ పనులు చేపట్టారు. రెండు షెడ్లు, ప్రహరీతో 2017లో నిర్మాణం పూర్తయింది. ఇక మామిడి కాయల అమ్మకాలు, కొనుగోళ్లు జరుగుతాయని రైతులు ఎంతగానో ఆశ పడ్డారు. దశాబ్దాలుగా పడుతున్న ఇబ్బందులు మటుమాయం అవుతాయని భావించారు. కానీ పాలకులు, అధికారుల ఉదాసీన వైఖరి, నిర్లిప్తత వల్ల రైతుల ఆశలు ఆవిరయ్యాయి. ఆరేళ్లుగా మ్యాంగో మార్కెట్ ఎలాంటి పురోగతి లేకుండా రైతులు ఆశలు వదులుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. మామిడి కాయల కొనుగోలు కోసం ట్రేడర్స్ ముందుకు రావాల్సి ఉంటుంది. ఎవరికీ పట్టింపు లేని కారణంగా ఇంతవరకు ఏ ఒక్కరు కూడా సానుకూలంగా స్పందించనట్లు తెలుస్తోంది. ఒకరిద్దరు ట్రేడర్స్ సంసిద్ధత వ్యక్తం చేసినా ఏదో కారణంచేత కొనుగోలు చేయలేకపోయారు. దీంతో రైతులు మహారాష్ట్రలోని మ్యాంగో మార్కెట్‌కు మామిడి కాయలు తీసుకెళ్లి మద్దతుధర దక్కక తీవ్రంగా నష్టపోతున్నారు.

**సౌకర్యాల కల్పనకు రూ.1.18 కోట్లు..**

అమ్మకాలు, కొనుగోళ్లు లేక ఉన్న మ్యాంగో మార్కెట్ యార్డులో కొత్తగా సౌకర్యాల కల్పనకు గత ప్రభుత్వం రూ.1.18 కోట్ల నిధులు మంజూరు చేసింది. అదనంగా మరో షెడ్ నిర్మాణానికి రూ.74 లక్షలు, సీసీరోడ్డుకు రూ.36 లక్షలు, ఆర్వోప్లాంట్ ఏర్పాటుకు రూ.8 లక్షలు మంజూరు చేశారు. రైతుల రాకపోకలు లేని మార్కెట్ యార్డులో ఆర్వోప్లాంట్ ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉందని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఏటా రూ.200 కోట్లకు పైగా వ్యాపారం జరిగే మామిడి క్రయ విక్రయాల కోసం కనీసం ఈసారైనా మార్కెటింగ్ శాఖ అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని రైతులు కోరుతున్నారు.

**కొనుగోళ్ల కోసమే సౌకర్యాలు**

మామిడి కాయల క్రయ విక్రయాలు సాగించడం కోసమే మ్యాంగో మార్కెట్ యార్డులో సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం. సీసీరోడ్డు, షెడ్ నిర్మాణం, ఆర్వోప్లాంటు ఏర్పాటు చేసి ఈసారి సీజన్‌లో మామిడికాయల విక్రయాలు జరిపేందుకు చర్యలు తీసుకుంటాం. ఆదిశగానే సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నాం.

– భాస్కర్, ఏఎంసీ ఇన్‌చార్జి కార్యదర్శి, బెల్లంపల్లి

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మంచిర్యాలటౌన్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్యసాయం రూ.10 లక్షలు పెంపుదల పథకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సంతోష్, జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, ఆర్డీవో రాములు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుబ్బారాయుడు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్చంద్రారెడ్డి, డీఎంఈ సూపరింటెండెంట్ డాక్టర్ అరవింద్, డీఆర్డీవో శేషాద్రి, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

చెన్నూర్: వరంగల్‌లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో చెన్నూర్ మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల విద్యార్థి టి.ప్రశాంత్ ఆరు కిలోమీటర్ల పరుగు పందెంలో గెలుపొంది జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కేపీఎం ప్రకాశ్‌రావు తెలిపారు. ఈ నెల చివరి వారంలో ముంబయిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడని పేర్కొన్నారు. ప్రశాంత్‌ను పీఈటీ విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

**విద్యార్థుల ప్రతిభ**

చెన్నూర్: కాగజ్‌నగర్‌లోని ఫాతిమా కాన్వెంట్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో చెన్నూర్ శార్వాణి పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని కరాటే మాస్టర్ రామగిరి స్వామి తెలిపారు. సనాతని, శ్రీనిత్య, మౌనశ్రీ, జానవి, అనన్య, దీప్యశ్రీ, జయదీప్‌రెడ్డి బహుమతులు సాధించారని తెలిపారు. విజేతలను కరస్పాండెంట్ మేడ శ్రావణ్‌కుమార్‌రెడ్డి అభినందించారు.

**హ్యాండ్‌బాల్ పోటీల్లో..**

భీమారం: భీమారంలో జరిగిన రాష్ట్రస్థాయి పాఠశాల ఫెడరేషన్ హ్యాండ్‌బాల్ పోటీల్లో స్థానిక కేజీబీవీ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని పాఠశాల ప్రత్యేక అధికారి కనకలక్ష్మి తెలిపారు. ఏ.మల్లేశ్వరి, జే.వైష్ణవి హ్యాండ్‌బాల్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో విజేతగా నిలిచారని తెలిపారు.

### 'మెరుగైన క్యాడర్ స్కీమ్ తెస్తాం'

శ్రీరాంపూర్: సింగరేణిలో తాము గెలిస్తే మైనింగ్ స్టాఫ్, ట్రేడ్‌మెన్స్, ఎస్‌డీఎల్ ఆపరేటర్లకు మెరుగైన క్యాడర్ స్కీంను తీసుకొస్తామని ఆ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, కలవేని శ్యాం తెలిపారు. సోమవారం ఆర్కే 7, న్యూటెక్ గనులపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులతో మాట్లాడారు. మహిళా కార్మికులను అండర్ గ్రౌండ్‌లో దించకుండా చేస్తామని పేర్కొన్నారు. యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, కేంద్ర ఉపాధ్యక్షులు తిరుపతి, రాజు, డెప్యూటీ జనరల్ సెక్రెటరీలు గరిగే స్వామి, మోతె రాఘవరెడ్డి, ఐరెడ్డి తిరుపతిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

# 23న సింగరేణి డే ఏర్పాట్లు చేయాలి

- ఎస్‌వోటూ జీఎం రఘుకుమార్


సమీక్ష నిర్వహిస్తున్న ఎస్‌వోటూ జీఎం రఘుకుమార్

శ్రీరాంపూర్: ఈ నెల 23న సింగరేణి ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని శ్రీరాంపూర్ ఏరియా ఎస్‌వోటూ జీఎం కే.రఘుకుమార్ అన్నారు. వేడుకలపై సోమవారం ఏరియా ముఖ్య అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాంపూర్ లోని ప్రగతి మైదానంలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎంలు అరవిందరావు(పర్సనల్), చిరంజీవులు(ఈఅండ్‌ఎం), ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, వర్క్‌షాప్ ఇంజనీర్లు సతీష్ చక్రవర్తి, రవికుమార్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కాంతారావు పాల్గొన్నారు.

# వేర్వేరు కారణాలతో నలుగురు ఆత్మహత్య


పోచం మృతదేహం

సిర్పూర్(టి): మనస్తాపంతో వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై దీకొండ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కర్జవల్లి గ్రామానికి చెందిన దుర్గం పోచం (62)కు ముగ్గురు కుమారులు, కుమార్తె సంతానం. ఆదివారం చిన్న కుమారుడు దుర్గం నవీన్, రెండో కుమారుడు చక్రిల మ..ద్య ఆస్తి కోసం వివాదం చోటు చేసుకుంది. దీంతో మనస్తాపానికి గురైన పోచం సోమవారం తెల్లవారు జామున ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్ద కుమారుడు ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

**పురుగుల మందు తాగి ఒకరు..**


సురేష్ (ఫైల్)

బెజ్జూర్: మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై విక్రమ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నాగుల్వాయి గ్రామానికి చెందిన మోర్లె సురేష్(37) కూలి పనుల నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి ఐదేళ్లుగా మంచిర్యాలలో నివాసం ఉంటున్నాడు. ఐదు నెలల క్రితం స్వగ్రామమైన నాగుల్వాయికి వచ్చారు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. సోమవారం ఉదయం మద్యం మత్తులో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం బెజ్జూర్ పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

**తల్లిదండ్రులు మందలించారని డిగ్రీ విద్యార్థిని ...**


వైష్ణవి మృతదేహం

లక్సెట్టిపేట: తల్లిదండ్రులు మందలించారని విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం మున్సిపాలిటీ పరిధిలోని మోదెలలో గాంధీనగర్‌కు చెందిన సావనపెల్లి సురేష్, తిరుమల దంపతులకు ఇద్దరు కుమార్తెలు సంతానం. సురేష్ ఆటో నడుపుతుండగా తిరుమల ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేస్తోంది. పెద్ద కుమార్తె వైష్ణవి(18) స్థానిక మోడల్ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతోంది. చదువుపై ఇష్టంలేని వైష్ణవి కాలేజీకి వెళ్లనని చెప్పడంతో తల్లిదండ్రులు మందలించారు. సోమవారం ఉదయం తండ్రి ఆటోలో తీసుకెళ్లి కళాశాలలో దింపి వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

**మద్యానికి బానిసై వ్యక్తి..**

మందమర్రిరూరల్: మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీనగర్‌కు చెందిన బోరె సతీష్ (42) కూలిపనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం సాయంత్రం మద్యం సేవించి ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులతో గొడవ పడ్డాడు. అనంతరం గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

# బోగస్ సర్టిఫికెట్లతో బోధన!

- ఎమ్మెస్సీ(మ్యాథ్స్) పూర్తి చేసినట్లు ద్రవిడ యూనివర్సిటీ నుంచి పట్టా
- బెజ్జూర్ జూనియర్ కళాశాలలో కాంట్రాక్ట్ లెక్చరర్‌గా విధులు
- నకిలీ డిగ్రీగా తేల్చిన అధికారులు
- రెగ్యులరైజేషన్ ప్రక్రియలో బయటపడిన అధ్యాపకుడి నిర్వాకం


నాగరాజు సమర్పించిన సర్టిఫికెట్లు

బెజ్జూర్(సిర్పూర్): విద్యార్థులకు విద్యాబుద్ధులు, సంస్కారం నేర్పించాల్సిన ఓ గురువే అడ్డదారి తొక్కాడు. 12 ఏళ్లుగా ప్రభుత్వ విద్యా సంస్థలో బోగస్ సర్టిఫికెట్లతో ఉద్యోగంలో కొనసాగుతూ అధికారులనే బురిడి కొట్టించాడు. అర్హత లేకున్నా పాఠాలు బోధిస్తూ ప్రభుత్వం నుంచి వేతనం పొందుతున్నాడు. కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసే ప్రక్రియలో భాగంగా అధికారులు సదరు లెక్చరర్ ధ్రువపత్రాలను యూనివర్సిటీకి పరిశీలన కోసం పంపించడంతో అసలు నిజం వెలుగులోకి వచ్చింది.

**2011లో ఉద్యోగం..**

పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన కాలవేని నాగరాజు బెజ్జూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మ్యాథ్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాలో గల ద్రవిడ యూనివర్సిటీ(కుప్పం)లో పీజీ పూర్తి చేసినట్లు సర్టిఫికెట్లు చూపి 2011 జూలైలో కాంట్రాక్ట్ పద్ధతిన అధ్యాపకుడిగా ఉద్యోగం సాధించాడు. అప్పటి నుంచి అదే కళాశాలలోనే లెక్చరర్‌గా కొనసాగుతున్నాడు. లెక్చరర్లను రెగ్యులరైజ్ చేసే విషయంలో ప్రభుత్వం కళాశాలల నుంచి లెక్చరర్ల వివరాలు, వారి అర్హతలకు సంబంధించి నివేదికలను కోరిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా బెజ్జూర్ కళాశాలలోని లెక్చరర్ల నివేదికను కళాశాల నుంచి ఉన్నతాధికారులకు పంపించారు. ఇక్కడే నకిలీ అధ్యాపకుడి బండారం బయటపడింది. నాగరాజు పీజీ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ కోసం ద్రవిడ యూనివర్సిటీ అధికారులకు పంపించగా.. సదరు వ్యక్తి తమ యూనివర్సిటీలో చదవలేదని, తాము ఎలాంటి సర్టిఫికెట్లు జారీ చేయలేదని.. ఈ సర్టిఫికెట్లు బోగస్ అని వారు స్పష్టం చేశారు. దీంతో కళాశాలలో పూర్తిస్థాయి విచారణ జరిపి ఉన్నతాధికారులకు రిపోర్టు పంపించారు. నకిలీ లెక్చరర్‌పై స్థానిక పోలీసు స్టేషన్‌లో మొదట ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు.

**గతంలోనూ ఫిర్యాదు..!**

బెజ్జూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నకిలీ ధ్రువపత్రాలతో ఒకరు లెక్చరర్‌గా కొనసాగుతున్నారని గతంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందినట్లు సమాచారం. అధికారులు అలసత్వం వహించడంతోనే సదరు వ్యక్తి ఇన్నేళ్లుగా విధుల్లో కొనసాగుతున్నాడని తెలుస్తోంది. ఫిర్యాదు అందిన వెంటనే అధికారులు విచారణ చేసి ఉంటే ఈ వ్యవహారం అప్పుడే బయటపడేదని స్థానికులు పేర్కొంటున్నారు. జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో కొంతమంది బోగస్ సర్టిఫికెట్లతో కొనసాగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారనే ఆరోపణలు ఉన్నాయి.

**ఉన్నతాధికారులకు నివేదించాం**

లెక్చరర్ల రెగ్యులరైజేషన్‌లో భాగంగా ఇటీవల బెజ్జూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుల వివరాలను ప్రభుత్వానికి పంపించాం. మ్యాథ్స్ లెక్చరర్‌గా కొనసాగుతున్న గోదావరిఖనికి చెందిన కాలవేని నాగరాజు సర్టిఫికెట్లు నకిలీగా ద్రవిడ యూనివర్సిటీ అధికారులు నిర్ధారించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక పోలీసు స్టేషన్‌లో అధ్యాపకుడిపై ఫిర్యాదు చేస్తాం.

– శంకర్, ఇన్‌చార్జి డీఐఈవో, కుమురంభీం ఆసిఫాబాద్

# దూరం సరిచేసిన ఎన్‌హెచ్ అధికారులు

సాక్షి స్పందన



కొత్తగా ఏర్పాటు చేసిన సూచిక

భీమారం: ఈ నెల 8న 'దూరం తగ్గించిన నేషనల్ హైవే అధికారులు' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం దూరాన్ని సరిచేస్తూ కొత్త బోర్డులను ఏర్పాటు చేశారు. రసూల్‌పల్లి నుంచి కోటపల్లి మండలంలోని రాష్ట్ర సరిహద్దు వరకు రోడ్డు నిర్మాణం చేపట్టిన నేషనల్ హైవే అధికారులు మధ్య వచ్చే గ్రామాల వద్ద గ్రామాన్ని చూపే బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే భీమారం నుంచి ఆరెపల్లి వరకు గల దూరాన్ని తగ్గిస్తూ రెండు చోట్ల బోర్డులు ఏర్పాటు చేశారు. దీనిని చూసిన ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. ఈ విషయం నేషనల్ హైవే అధికారుల దృష్టికి తీసికెళ్లి సమస్య పరిష్కారం అయ్యేలా చేసిన 'సాక్షి'కి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# 'ప్రభుత్వ సంఘాలు గెలిస్తే సంస్థకు నష్టమే'


మాట్లాడుతున్న రాజ్‌కుమార్

మందమర్రిరూరల్: సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో ప్రభుత్వ సంఘాలు గెలిస్తే సంస్థకు నష్టమేనని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. ఆదివారం రాత్రి మందమర్రి ఏరియాలోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు ఉన్నప్పుడు ఆ పార్టీల అనుబంధ కార్మిక సంఘాలైన ఐఎన్టీయూసీ, టీబీజీకేఎస్ కార్మిక సంఘాలు గెలిచి సంస్థను దోచుకున్నాయన్నారు. ఈ సందర్భంగా పలువురు ఏఐటీయూసీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ డెప్యూటీ సెక్రటరీ వీరభద్రయ్య, నాయకులు సత్యనారాయణ, సుదర్శన్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ కట్టడాల కూల్చివేత


అక్రమ నిర్మాణాలు కూల్చి వేయిస్తున్న దృశ్యం

నస్పూర్: పట్టణ పరిధిలోని ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన అక్రమ కట్టడాలను అధికారులు జేసీబీలతో కూల్చివేయించారు. సోమవారం డీటీఎఫ్(డిస్ట్రిక్ టాస్క్ ఫోర్స్) టీం సభ్యులు, మున్సిపల్ కమిషనర్ టి.రమేశ్, తహసీల్దార్ వనజారెడ్డి, మంచిర్యాల రూరల్ సీఐ సంజీవ్, సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్, టీపీఎస్ సతీష్ తమ సిబ్బందితో నస్పూర్ శివారులోని సర్వేనంబర్ 42, 53 ప్రభుత్వ భూమిలో నిర్మించిన 12 ఇంటి నిర్మాణాలు, ఒక ప్రహరీ కూల్చివేయించారు.

**పెట్రోల్ పోసుకుని బాధితుడి హల్‌చల్**

అధికారులు అక్రమ నిర్మాణాలను కూల్చి వేయిస్తున్న క్రమంలో పలువురు బాధితులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఓ ఇంటిని కూల్చివేస్తున్న క్రమంలో బాధితుడు తన ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే స్పందించిన పోలీసులు పెట్రోల్ సీసా లాక్కుని అతని ఒంటిపై నీరు పోయడంతో ఎలాంటి ప్రమాదం జరుగలేదు.

# చేపల పెంపకంపై శిక్షణ

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో చేపల పెంపకంపై నైపుణ్య శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. మంచిర్యాల, కుమురంభీం జిల్లాల నుంచి ఔత్సాహికులైన 25 మంది రైతులు హాజరయ్యారు. కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కోట శివకృష్ణ, మత్స్యశాఖ శాస్త్రవేత్త మహేష్ రైతులకు చేపల పెంపకంపై అవగాహన కల్పించారు. చేపల పెంపకానికి అనువైన నేలలను ఎంచుకోవడం చాలా కీలకమని, నాణ్యమైన చేపపిల్లలు తీసుకోవాలని తెలిపారు. రైతుల సందేహాలను శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు.


మాట్లాడుతున్న ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శివకృష్ణ

### బంగారు గొలుసు అపహరణ


బాధితురాలు శకుంతల

కాగజ్‌నగర్‌టౌన్: వృద్ధురాలి మెడలోనుంచి బంగారు గొలుసు అపహరించిన సంఘటన పట్టణంలోని సర్‌సిల్క్ ఎస్‌కాలనీలో చోటు చేసుకుంది. బాధితురాలు శకుంతల తెలిపిన వివరాల ప్రకారం తుక్కు సామగ్రి కొనుగోలు చేసే వ్యక్తి వృద్ధురాలి ఇంటికి వచ్చాడు. సామగ్రి విక్రయిస్తుండగా ఇనుపరాడ్‌తో చంపుతానని బెదిరించాడు. దీంతో వృద్ధురాలు కేకలు వేయగా మెడలో నుంచి మూడు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లాడు. కాలనీవాసులు పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ బుద్దే స్వామి సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.